క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: ఫీడర్ కండక్టర్ మార్పు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ గోపాలపట్నం రూరల్ ఏఈ డి.వి.ఎల్.కుమార్ తెలిపారు. లంకా నగర్, విరాట్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం


మడక దేవి (ఫైల్)

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివానిపాలెం గ్రామానికి చెందిన మడక దేవి (30) ఈ నెల 7 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త రాము పరవాడ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దేవి తల్లిదండ్రులు గండివానిపాలెంలో నివసిస్తున్నారు. వారి ఇంటి నుంచి ఆమె ఈ నెల 7న సాయంత్రం 5 గంటలకు బయటకు వెళ్లిందని, అప్పటి నుంచి సమాచారం లేదని తెలిపారు. వారికి ఇద్దరు పిల్లలు. ఆమె ఆచూకీ తెలిసిన వారు పరవాడ సీఐ పి.ఈశ్వరరావుకు 9440796038 నంబర్‌లో సమాచారం అందజేయాలని స్టేషన్ హెచ్‌సీ శ్రీనివాసరావు కోరారు.

ఘనంగా పైడితల్లి తీర్థం


పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం అధికారులు భక్తులకు పులిహోర ప్రసాదం అందజేశారు.

చెరువుల పరిరక్షణకు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీనంద మహరాజ్ తదితరులు

సబ్బవరం: అసకపల్లిలో ఆక్రమణలకు గురవుతున్న చెరువులను పరిరక్షించాలని ఉత్తరాంధ్ర సాగునీటి చెరువుల పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు భారతీనంద మహరాజ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బి.సత్యనారాయణను గురువారం అసకపల్లి ఉప సర్పంచ్ కాపుశెట్టి సురేష్‌తో పాటు పలువురు రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. అసకపల్లి రెవెన్యూ పరిధిలో సంగడాల చెరువు, కొత్తచెరువు, వాకాడ చెరువు, చిన్నయ్య చెరువు, తురక చెరువు, చింతల చెరువు, భూరుగు చెరువు, చివిటి చెరువుతో పాటు ఎరుకునాయుడుపాలెంలోని పలు చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. వీటికి సమగ్రంగా సర్వే నిర్వహించి, హద్దులు వేసి ట్రెంచ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దువ్వి దుర్గాలు, మొల్లి చిన్నారావు, దూళి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో హెచ్ఐవీ స్థాయి గుర్తింపునకు సర్వే

అగనంపూడి: గర్భిణుల్లో హెచ్ఐవీ స్థాయి, శాతాన్ని గుర్తించేందుకు హెచ్ఐవీ సెంటినల్ సర్వేలెన్స్ (హెచ్ఎస్ఎస్) నిర్వహిస్తున్నట్టు ఐసీటీసీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ వై.కామేశ్వరరావు అన్నారు. అగనంపూడి ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్)లో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్వే తీరును పరిశీలించేందుకు అగనంపూడి ఆస్పత్రికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ శాతం గుర్తించడం ద్వారా గతానికి ఇప్పుడు ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని తీసుకోవల్సిన చర్యల గుర్తించి చర్చిస్తామన్నారు. గర్భ నిర్ధారణకు వచ్చే సమయంలో మహిళలకు ఈ పరీక్షలు నిర్వహించడం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి, తగ్గుదల వంటి వాటిని గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఐఎస్ బద్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, ఆర్ఎంవో గోపాలకృష్ణ, ఐసీటీసీ కౌన్సెలర్ ఎం.వి.రవికుమార్, ఎల్‌టీ కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- నాయుడుపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


రాముడుగారిదొడ్డిలో మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పరవాడ: పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. నాయుడుపాలెం గ్రామంలో గురువారం నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాముడిగారిదొడ్డి, సిమ్మన్నగారిదొడ్డి, కోరంగివానిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఈ మేరకు ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, పరవాడ గ్రామాల్లో గురువారం రూ.72.08 లక్షల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించారు. ముందుగా ముత్యాలమ్మపాలెం జెడ్పీ పాఠశాలలో రూ.13.80 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాలు ప్రారంభోత్సవం చేశారు. రాముడుగారిదొడ్డిలో సింహాద్రి ఎన్టీపీసీ మంజూరు చేసిన రూ.11 లక్షల నిధులతో నిర్మించిన మంచినీటి పథకం, జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాలు ప్రారంభించారు. ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.3 లక్షలతో సిమ్మన్నగారిదొడ్డిలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు, కొరంగివానిపాలెంలో రూ.11 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం, జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలకు శ్రీకారం చుట్టారు. పరవాడలో ఎన్టీపీసీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన భవిత కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పైల శ్రీనివాసరావు, సీతారామయ్య, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు మంజూ సిన్హా, ఎంపీడీవో హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, వ్యవసాయాధికారి చంద్రావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షన్ముఖ, ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సీనియర్ మేనేజర్ ప్రకాశరావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురదరాజు, నాయకులు బొద్దపు చిన్నారావు, పైల అప్పలనాయుడు, కన్నూరు నేస్తాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

పరవాడ: సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. పరవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలు, కుల మతాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజల్లో ధైర్యంగా తిరగ గలుగుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సచివాలయ వ్యవస్థతో పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము వెళుతున్న క్రమంలో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. నాయుడుపాలెంలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా రూ.17.29 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ.4.71 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. టీడీపీ నాయకుల అబద్ధపు వాగ్దానాలను ప్రజలు నమ్మే ప్రసక్తి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు చల్లా కనకరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల హరీష్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు


జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి జరిపారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేయింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కనులపండువగా కలపాక దుర్గాదేవి పండగ

పరవాడ: కలపాక గ్రామంలో కొలువుదీరిన దుర్గాదేవి పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం కనులపండువగా జరుపుకొన్నారు. గ్రామ పొలిమేరలో కొలువుదీరిన దుర్గాదేవిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యేను గ్రామ సర్పంచ్ బొండా కనకారావు ఘనంగా సత్కరించారు. రాత్రికి నేల డ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్లు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బాణసంచా కాల్పులతో అమ్మవారి అనుపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ సప్పా ప్రభ, ఇందల రామారావు, జానకీరామ్, జి.మోహన్‌రావు, అప్పారావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్పన్న ఆలయంలో ఉద్యోగం పేరిట బేరసారాలు!

- సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్
- దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని బేరసారాలు జరిపిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో గురువారం వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. 'తనకు ఉద్యోగం కావాలని గతంలో మిమ్మల్ని కలిశానని ఓ వ్యక్తి.. మరో అజ్ఞాత వ్యక్తికి ఫోన్ చేయగా, తమకు ద్వారకానగర్, ఎన్ఏడీ కూడలిలో బ్రాంచిలు ఉన్నాయని, ఉద్యోగానికి రూ.3 లక్షల వరకు చెల్లించాలని, పర్మినెంట్ అవుతుందని, తాను ప్రస్తుతం క్యాంపులో ఉన్నానని, ఈనెల 11న తనని కలవాలని ఆ అజ్ఞాత వ్యక్తి చెప్పిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఆడియో పుటేజీలు పలు వాట్సప్ గ్రూపుల్లో కూడా చక్కర్లు కొట్టాయి. దేవస్థానం అధికారుల దృష్టికి కూడా ఈ విషయం వెళ్లింది. అయినా ఈ విషయంపై దేవస్థానం అధికారులు ఎవరూ స్పందించ లేదు. దేవస్థానంలో టెండరు ఖరారు చేసుకున్న ఏజెన్సీలు మాత్రమే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తాయి. ఆ ఏజెన్సీకే సదరు ఉద్యోగుల జీతాలను దేవస్థానం చెల్లిస్తుంది. డైరెక్ట్‌గా అవుట్ సోర్సింగ్ సిబ్బందికి దేవస్థానం జీతాలు చెల్లించదు. కాగా ఈ నెల ఒకటో తేదీ నుంచి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకి సంబంధించిన కొత్త ఏజెన్సీ విధులు నిర్వర్తిస్తోంది. ఇదిలా ఉండగా దేవస్థానంలో ఉద్యోగాలు ఇస్తామంటూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దేవస్థానంలో ఉద్యోగం ఇస్తామని ఒక ఏఈవో పేరిట కూడా సర్క్యులర్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఇంత జరుగుతున్నా ఈ చర్యలకు ఎవరు పాల్పడుతున్నారోనన్న విచారణ కూడా దేవస్థానం అధికారులు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇటువంటి ఘటనలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా బంగారమ్మ, కుంచాలమ్మ తీర్థం

రసవత్తరంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు


ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ తల్లి


ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గొర్లివానిపాలెం గ్రామంలో కొలువైన బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల తీర్థమహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కోలాటం పోటీలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి.

పోటాపోటీగా కబడ్డీ పోటీలు

అమ్మవార్ల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. గ్రామ పెద్దలు గండి దేముడు, గొర్లి చైతన్య, బాదిరెడ్డి లక్ష్మణ తదితరులు పోటీలను ప్రారంభించారు. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 28 జట్లు పాల్గొంటున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కోటాన వెంకట రమణ, గండి హనుమంతు, గొర్లి కృష్ణ, గొర్లి పైడన్న తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్‌లో సంపత్ వినాయక తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

చీమలాపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ్


తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ జోన్-8 జెడ్సీ మల్లయ్యనాయుడు, కార్పొరేటర్ ముమ్మన దేవుడు కార్యక్రమంలో పాల్గొని, స్వచ్ఛతపై స్థానికులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటిస్తే, దోమలకు చెక్ పెట్టవచ్చన్నారు. తద్వారా వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి, పొడి, ప్రమాదకర చెత్తగా విభజించి, ఇంటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు వేరువేరుగా అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. పాలిథిన్ కవర్లకు బదులు నార, కాగితం, వస్త్ర సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా చీమలాపల్లిలో జెడ్సీ మల్లయ్యనాయుడుతో కలిసి ముమ్మన పర్యటించారు. డ్రైనేజీలు, వాటర్ సప్లై, ఓపెన్ ఏరియా, పార్కు స్థలాలు, రోడ్డు సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, శానిటరీ సూపర్‌వైజర్ రమణ, వాటర్ సప్లై ఏఈ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా మరిడిమాంబ పండగ


మరిడిమాంబ సన్నిధిలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: రావాడ శివారు బొట్టవానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం కనులపండువగా జరిగింది. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి డప్పు, వాయిద్యాలతో అమ్మవారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, చిడతల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు ఉత్సవాన్ని నిర్వహించారు. పరవాడ వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు పల్లా గోవిందు, కావలి అప్పలరాజు, వాసు, బొద్దపు చిన్నారావు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

అసకపల్లి సర్పంచ్‌పై కేసు నమోదు


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం: ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారుల విధులను ఆటంకపరచడమే కాకుండా, వారిపై రాళ్లు రువ్వి వివాదాలకు దిగిన అసకపల్లి సర్పంచ్ కర్రి నరిసింగరావుపై కేసు నమోదైనట్లు తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఎర్రవానిపాలెంలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన ఆర్ఐ, వీఆర్వోతో పాటు ఇతర సిబ్బందిపై సర్పంచ్ వివాదానికి దిగి, దాడి చేశారని తెలిపారు. సర్వే నంబర్ 16లోని ఎర్రవాని చెరువులో అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే అనేక సార్లు హెచ్చరించినా, పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. రెవెన్యూ అధికారులపై దాడి నేపథ్యంలో సెక్షన్-353, సెక్షన్-509, ఐపీసీ 34 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవోలకు తెలియజేశామన్నారు.

పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

పరవాడ: పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సినిమా హాలు కూడలిలో గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, చిన్నతరహా పరిశ్రమల్లో సుమారు 34 వేల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి ఎటువంటి ప్రమాదాలు జరిగినా, అనారోగ్యానికి గురైనా దూరంలో ఉన్న విశాఖకు వెళ్లి వైద్యం పొందాల్సి వస్తుందన్నారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో క్షతగాత్రులను విశాఖకు తరలించే లోపే మరణిస్తున్నారన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కన్నూరు నాయుడు, డొకల జగన్, నాయుడు, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాలయ వార్షికోత్సవాలు

భక్తితో సామూహిక రామాయణ పారాయణం


సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలో సీతారామాలయ 20వ వార్షికోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ మద్రామాయణ సామూహిక పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో వేదికపై వేంజేప చేసి, ఉదయం 9.30గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీవీఆర్ మూర్తి, కార్యదర్శి ఎ.వి.చలపతిరావు, రామారావు, నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9.30గంటల నుంచి మహాలక్ష్మీదేవికి కుంకుమపూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పదో తరగతే ఉన్నత విద్యకు కీలకం


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

పెదగంట్యాడ: ప్రతి విద్యార్థికీ పదో తరగతి అత్యంత కీలకమని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి అన్నారు. భవిష్యత్తుకు పునాది ఇక్కడే వేసుకోవాలని సూచించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, భవనాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పెంచాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివించాలని కోరారు. ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఆదేశించారు. పరీక్షలంటే విద్యార్థుల్లో భయం ఉంటుందని, వారిలో అభద్రతా భావం లేకుండా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి బాగా చదవాలన్నారు. పదో తరగతిలోనే లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

ఆర్‌జేడీ జ్యోతికుమారి నడుపూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యా ప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. పాఠశాల భవనాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే, పక్కనే ఉన్న కమ్యూనిటీ హాలును వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల విద్యా శాఖాధికారి పైడపునాయుడు, నడుపూరు హైస్కూల్ హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, మంత్రి రాజశేఖర్, మంత్రి గోపీ, మంత్రి శంకరనారాయణ ఉన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు కూడా గురువారం ఉదయం పాఠశాలను సందర్శించారు.

728వ రోజుకు ఉక్కు రిలేదీక్షలు


మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను సృష్టించే ప్రయత్నం చేయాలి, కానీ అమ్మకూడదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 728వ రోజు, గురువారం కన్‌స్ట్రక్షన్, ట్రాఫిక్, ఆర్ఎండీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, సీహెచ్ సన్యాసిరావు, అప్పలరాజు, గుమ్మడి నరేంద్ర తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉక్కు ఉత్పత్తుల తయారీకి కావలసిన ముడి సరుకులను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు మారాలన్నారు. ప్రజా ఉద్యమాలకు ఎంత పెద్ద నియంతైనా తలవంచక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో హరనాథ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.